జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : మండల ప్రజలందరూ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చెప్పారు. శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు సచివాలయాల ద్వారా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకంలో కులం, ఆదాయం సర్టిఫికెట్లు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, భూహక్కు పత్రాలు, మ్యుటేషన్, కొత్తరేషన్‌కార్డు, రేష్‌కార్డును విభజించటం, ఆధార్‌లో మార్పు చేర్పులు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానించడం, మ్యారేజ్ సర్టిఫికెట్ తదితర సర్టిఫికెట్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకం అమలు చేస్తున్నారని, అవసరమైన పత్రాల కొరకు ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. శనివారం రంగసముద్రం 1 వ సచివాలయంలంలో ఈ పథకం ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి సచివాలయాల మండల కన్వీనర్లు కల్లూరు రమణారెడ్డి, గుండం హనుమంతారెడ్డి, సగిలి సుదర్శన్, గోపవరం మల్లికార్జునరెడ్డి, యద్దారెడ్డి, పుత్తా శ్రీరాములు, చౌదరి రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ అల్లాహ్, బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ నేడు

గోపవరం : మండలంలోని గోపవరం సచివాయలంలో శనివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఇంటింటి సర్వేలో గుర్తించడం జరిగిందని, ఈ మేరకు వారందరికి ఉచితంగా సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు.

నేడు రామాపురంలో జగనన్న సురక్ష

కలసపాడు : ఎగువ రామాపురం గ్రామంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. 11 రకాల సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలని ధర్నా

ప్రొద్దుటూరు : విద్యుత్ చార్జీలను తగ్గించాలని స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు అధ్యక్షతన అఖిలపక్షం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యుత్ నూతన సవరణ చట్టం పేరుతో వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించడం సరికాదన్నారు. రాయలసీమలో వ్యవసాయ పరిస్థితులు తెలిసీ ఈ విధానాలను అమలు చేయడం ఏమిటన్నారు. ఈ విద్యుత్ డివిజన్ పరిధిలో 18వేల పంపు సెట్లు ఉన్నాయని, విద్యుత్ కొనుగోలుకు సబ్సిడీని ప్రభుత్వం వేయకుంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పీఎండీ నజీర్ అహ్మద్ , ఆమ్ ఆద్మీపార్టీ ఫిజ్జా దస్తగిర్, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి సలీం మాట్లాడారు.

విద్యుత్‌చార్జీలు తగ్గించండి

పోరుమామిళ్ల : పెంచిన విద్యుత్‌చార్జీలు తగ్గించాలని శుక్రవారం సీపీఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్, సీపీఐ మండల నాయకులు మస్తాన్, రవి మాట్లాడుతూ సెస్, ట్రూఅప్ చార్జీల పేరుతో ఆరు నెలలకు ఒకసారి విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెనుభారాన్ని మోపుతున్నాయన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

మైదుకూరు : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని శుక్రవారం మైదుకూరులోని విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, సర్వీసు చార్జీల పేరుతో పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

కుష్టు వ్యాధి నివారణకు
కృషి చేయండి

బద్వేలు అర్బన్ : కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇందుకోసం జరుగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న లెప్రసీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడం వలన వారికి వ్యాధి ప్రారంభ దశలోనే చికిత్స అందించేందుకు వీలవుతుందన్నారు. కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించి కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టరు ఖాదర్‌వలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు ఓపీ విభాగం, రోగుల వసతులు, ఆస్పత్రి పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం వలంటీర్లతో కలసి అట్లూరు, ఎస్.వెంకటాపురం కాలనీలలో కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పర్శలేని పొడలు ఉండి చెమట పట్టనట్‌లైతే పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలన్నారు. ఆయన వెంట డాక్టరు డి.విశ్వంత్, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, సూపర్‌వైజరు మాణిక్యమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైనది



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

బద్వేలు అర్బన్ : న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని, న్యాయవాదులందరూ నిరుపేదలకు న్యాయం చేసి వృత్తి పవిత్రతను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌ఆర్‌ఎన్‌బీ ఫంక్షన్ హాలులో బద్వేలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుదర్శన్‌రెడ్డికి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైన వృత్తి అని, పౌరహక్కులు, చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయవాదులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, జెడ్పీటీసీ పోలిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, జిల్లా కోర్టు జీపీ శంకర్‌రెడ్డి, పీపీలు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉమాదేవి, రవిచంద్ర, సీనియర్ న్యాయవాదులు నాగిరెడ్డి, కె.సుదర్శన్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, ఆర్.ఆర్.వర్మ, బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి. ఎస్.ప్రసాద్, వి.సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం న్యాయబద్ధంగా ఉండాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజల సమ్యలను ఇరువురితో మాట్లాడి న్యాయంగా పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. రాజుపాళెంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రజలు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా టంగుటూరు గ్రామంలోని నీటి కుంట సమస్యను వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గౌతమ్ రెడ్డి, రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇతర గ్రామాల్లో పొలాలకు వెళ్లే దారి సమస్యలతోపాటు భూ సమస్యలను రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమస్యలను ఇరువురితో మాట్లాడి సామరస్యంగా న్యాయబద్ధంగా పరిష్కారం మార్గం చూపాలని తహసీల్దార్ ఇందిర రాణి, డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డిలకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే మండలంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ విలేజ్ క్లినిక్ భవనాలను వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని పీఆర్ ఏఈ శివనారాయణకు సూచించారు. మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, సచివాలయాల కన్వీనర్ శేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బ్రహ్మంగారిమఠం : గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు సోమిరెడ్డిపల్లె 3 గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సేవలు అభినందనీయం

కాశినాయన : అనాథలకు చేస్తున్న సేవలు అభినందనీయమని కడప రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి బీటీ హరానంద తెలిపారు. శుక్రవారం మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో ఉన్న వివేకానంద సేవాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి అనాథలకు సేవలందిస్తున్న నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామతులసిలకు అభినందనలు తెలియజేశారు. జీవితంలో చివరి దశలో మంచానికే పరిమితమైన వారికి సేవలు చేయడం భగవంతుని కృప అన్నారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ నిర్వాహకులు ఆయనకు వివేకానందుని ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో స్వామి జయగోపాలనంద, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వారం డ్రైడే పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : సోములవారిపల్లె పంచాయతీ పెన్నానగర్‌లో, వీవీ నగర్, ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు హనీఫ్‌బాబా, శివప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ ప్రజలందరూ వారంలో ఒక రోజు తప్పక డ్రైడేను పాటించాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా తొలగించాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన మలేరియా, డెంగీ జ్వరాలు రావని తెలిపారు. సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, మాధవ రెడ్డి, సీహెచ్‌ఓలు శిరీష, గంగ తులసి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్బయ్య, గాయత్రి, ఉమారాణి, ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ, వరలక్ష్మి, చెంచమ్మ, సాలమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

స్థానిక శ్రీనివాసనగర్‌లో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దినేష్ మాట్లాడుతూ ప్రజలు తమ చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సీఓ నాగజ్యోతి, హెల్త్ సెక్రటరీ కవిత పాల్గొన్నారు.

వైఎస్సార్ పంటల బీమా మంజూరు

మైదుకూరు : మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం మంజూరైంది. ఉల్లి, చీని, పత్తి, కంది పంటలు సాగు చేసిన రైతులకు ఈ బీమా వర్తిస్తుంది. మండలంలో దిగుబడి ఆధారంగా 1519 మంది రైతులకు రూ.2,47,94,521, వాతావరణ ఆధారిత బీమా కింద 59 మంది రైతులకు రూ.1,92,01,754 మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. ఉల్లి పంటకు ఒక ఎకరాకు రూ.10,180, చీని పంటకు రూ.9,600, పత్తి పంటకు రూ.14,667, కంది పంటకు రూ.810 మంజూరైనట్లు ఏఓ వివరించారు. బీమా పరిహారం వివరాలను రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో చూసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. బీమా పరిహారం మొత్తం జూలై 8న రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

ఉనికి కోసమే ప్రవీణ్ అనుచిత వ్యాఖ్యలు

ప్రొద్దుటూరు : రాజకీయ ఉనికి కోసమే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భూ మాఫియా వల్ల ప్రొద్దుటూరులో మూడు హత్యలు జరగబోతున్నాయన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తక్షణమే తన దగ్గర ఉన్న పూర్తి సమాచారాన్ని పోలీసులకు చేరవేసి వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రవీణ్‌పై ఉందన్నారు. అలా కాకుండా మాట్లాడి ఇంత వరకు పోలీసులకు సమాచారాన్ని ఇవ్వకుండా అందుబాటులో లేకపోవడం సమంజసం కాదన్నారు. కేవలం తన రాజకీయ ఉనికి కోసం ప్రొద్దుటూరులో భయాందోళన సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవీణ్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రవీణ్ రెడ్డిపై తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఇందులో అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందు కోసం ఇంటర్, ఆపైన చదివిన వారు అర్హులన్నారు. రెండు నెలల ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ ఇన్‌చార్జి సెల్ నంబర్ 9701401902కు ఫోన్‌చేయాలన్నారు.

పంటల బీమా మంజూరు

రాజుపాళెం : గతేడాది ఖరీఫ్ 2022 ఏడాదికి గాను రాజుపాళెం మండలంలో పత్తి పంట సాగు చేసిన 3,221 మంది రైతులకు పంటల బీమా పరిహారం రూ.9,93,83,007 మంజూరైందని మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో పత్తి పంట నష్టపోయిన రైతుల వివరాల జాబితాను ప్రకటించామన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని ఎంపీఎస్ ధ్యానమందిరంలో జూలై 1, 2, 3 తేదీల్లో శ్రీకైవల్య సత్సంగ్ 13వ వార్షికోత్సవం, గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు శ్రీకైవల్య సత్సంగ్ శిష్య బృందం ఒక ప్రకటనలో తెలిపింది. బ్రహ్మశ్రీ కైవల్య తీర్థ స్వామి పర్యవేక్షణలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు భగవద్గీత పారాయణంతో పాటు పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు.